క్లుప్తంగా

కొండలమ్మను దర్శించుకున్న తులసిబాబు



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కె.తులసిబాబు శుక్రవారం దర్శించుకున్నారు. ఆయన్ను ఆలయ ఈఓ కానూరి సురేష్ సన్మానించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందజేశారు. తొలుత ఆయన పేరిట అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలను ఒనరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కొడాలి రామరాజు, జనసేన నాయకుడు మాదాసు శ్రీనివాసరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పామర్రు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ప్రధానమంత్రి ఆదేశాల మేరకు మొక్కలు నాటే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటడమే కాకుండా దాని నిర్వహణ బాధ్యతలను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వి గణేష్, కె ప్రవీణ్ చంద్ర, ఆంజనేయులు, ప్రసాద్, నాని పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతులు, లైన్ల విస్తరణ, మార్పుల కారణంగా శనివారం పట్టణ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి 12 గంటల వరకు అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి మండలాల్లో పలు సబ్‌స్టేషన్ల పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ పి.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ముదినేపల్లి మండలం చిగురుకోటలో 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నామని పేర్కొన్నారు. దీంతో కైకలూరు మండలంలో కైకలూరు, వరహాపట్నం, పల్లెవాడ, కలిదిండి మండలంలో కలిదిండి, పోతుమర్రు, కోరుకొల్లు, మూలలంక, కాళ్లపాలెం, ముదినేపల్లి మండలంలో చిగురుకోట, సింగరాయపాలెం, కొత్తపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని తెలిపారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



గుడివాడ టౌన్: విద్యార్థులు సాధారణ విద్యకే పరిమితం కాకుండా శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఏఎన్నార్ కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు అన్నారు. కళాశాల్లో జాతీయ అంతరిక్ష దినోత్సవం-2024 పురస్కరించుకుని విద్యార్థులకు చంద్రుని తాకేటప్పుడు జీవితాలను తాకడం అనే అంశంపై శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరిక్ష అన్వేషణపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంచే సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, అధ్యాపకులు కె.అనిల్‌కుమార్, ప్రసాదు, బి.శ్రీదేవి, కె.రూప, బి.దివ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు పోస్టల్‌శాఖ స్కాలర్‌షిప్‌లు

గుడివాడ టౌన్: దీన్‌దయాళ్ స్పర్శ్ యోజన-2024 ద్వారా పోస్టల్ శాఖ విద్యార్థులకు రూ. 6 వేలు వరకు స్కాలర్‌షిప్ ఇస్తుందని గుడివాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ చల్లా అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల నుంచి దరకాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి చదువుచున్న విద్యార్థులు గత ఏడాది చదివిన తరగతి పరీక్షల్లో 60 శాతం పైబడి మార్కులు సాధించిన వారు పోటీ పరీక్షకు అర్హులని పేర్కొన్నారు. దరకాస్తు చేసుకున్న విద్యార్థులకు పోటీపరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షలో అర్హత సాధించిన ప్రతి విద్యార్థికి నెలకు రూ. 500 చొప్పున ఏడాదిపాటు రూ. 6 వేలు స్కాలర్‌షిప్ అందజేస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 82474 88868లో సంప్రదించాలని కోరారు.

ప్రాణదాతలకు భద్రత కరువు



కరోనా వంటి విపత్తు సమయంలో ఎందరో కోవిడ్ బాధితుల ప్రాణాలను వైద్యులు కాపాడారు. ఈ క్రమంలో పలువురు డాక్టర్లు ప్రాణాలు సైతం కోల్పోయారు. అటువంటి ప్రాణదాతలకు భద్రత కరువైంది. కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటన పునరావృతం కాకుండా ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి ప్రత్యేక భద్రత కల్పించాలి.

– డాక్టర్ మమత, పీహెచ్‌సీ వైద్యాధికారి, కపిలేశ్వరపురం



కఠినమైన శిక్షలు అవలంబించాలి



కోల్‌కతాలో మృగాల కన్నా దారుణంగా డ్రగ్స్ మత్తులో ట్రైనీ డాక్టర్‌ను పాశవికంగా అత్యాచారం చేసి చంపిన నిందితులను కఠినంగా శిక్షించాలి. భవిష్యత్‌లో ఎవరూ ఇటువంటి అకృత్యాలకు పాల్పడకుండా ఉండేలా అరబ్ దేశాల్లో అవలంబిస్తున్న శిక్షలను వేయాలి. అప్పుడే ఇలాంటి అకృత్యాలు ఆగుతాయి.

– సాగిరాజు ఉదయభాస్కరరాజు, ఆర్‌ఎంపీల అసోసియేషన్ జిల్లా కార్య నిర్వహణ కార్యదర్శి

వరలక్ష్మీ నమోస్తుతే..



గుడివాడ విజయదుర్గ దేవస్థానంలో గాజులతో అలంకరించిన అమ్మవారు



వేమవరంలో భక్తులకు దర్శనమిచ్చిన కొండలమ్మ



గుడ్లవల్లేరు మండలం వేమవరంలో సామూహిక వ్రతంలో మహిళా భక్తులు

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతం మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళా భక్తులకు పూజకు అవసరమైన అమ్మవారి ఫొటో పూజా సామగ్రిని ఆలయ ఈఓ కానూరి సురేష్ అందజేశారు. అమ్మవారి వ్రతాల అనంతరం మహిళా భక్తులు అన్న ప్రసాదాలను స్వీకరించారు.

ఘనంగా శ్రావణ శుక్రవార పూజలు

గుడివాడ టౌన్: శ్రావణమాసం మూడో శుక్రవారం పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నీలామహల్ రోడ్‌లోని శ్రీ విజయదుర్గ దేవస్థానంలో అమ్మవారిని గాజులతో అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు. ఆలయ అర్చకులు పునీత్ శర్మ మాట్లాడుతూ శ్రావణమాసం అమ్మవారికి ఎంతో ప్రీతికరమైనదని ప్రత్యేకించి శ్రావణ శుక్రవారం అమ్మవారిని దర్శించుకోవడం వలన మహిళలు పుణ్యస్త్రీలుగా మిగిలిపోతారని నమ్మకం అన్నారు. స్థానిక వాసవిచౌక్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి వాసవీ క్లబ్ విద ర్భపురి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు, పూలు, మిఠాయిలు సమర్పించారు.

కైకలూరులో..

కైకలూరు: మండలంలోని పలు ఆలయాల్లో మూడో శ్రావణ శుక్రవార పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్యామలాంబతల్లికి ఆటపాక గ్రామానికి చెందిన రామిశెట్టి బుజ్జి పుష్పాలంకరణ చేయించారు.

భక్తులకు ఉచిత ప్రసాద దాతలుగా పోట్లూరి జగన్మోహనరావు, మండా రాఘువులు, వద్లాని శ్రీరామచంద్రమూర్తి, బొప్పన మంగతాయారమ్మ, నాగిరెడ్డి శ్యామలరావు, తిరుమాని శ్యామలరాజు వ్యవహరించారు. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

పమిడిముక్కల: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. పమిడిముక్కల సర్పంచ్ ముళ్లపూడి సునీత ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఉపాధి పథకం పేదలకు వరంలాంటిదన్నారు. ఉపాధి పథకంలో గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై గ్రామ సభలో చర్చించి తీర్మానం చేయాలన్నారు. అగినపర్రులో సర్పంచ్ కోట మణిరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఈఓఆర్డీ కొండేటి వెంకటేశ్వరరావు పాల్గొని 2024-25 ఆర్థిక సంవత్సర చేపట్టాల్సిన పనులు, సామాజిక తనిఖీపై అవగాహన కల్పించారు. గురజాడ, తాడంకి గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో ఎంపీడీఓ చీలి విఠల్‌పాల్, గోపువానిపాలెం గ్రామసభలో ఏఓ రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారిగా ఉంటాం

కూచిపూడి(మొవ్వ): కూటమి ప్రభుత్వం ప్రజలకు జవాబుదారిగా ఉంటుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ పేర్కొన్నారు. మొవ్వ మండంలోని 21 గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలను నిర్వహించారు. కూచిపూడి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కొండవీటి వెంకట రమణ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంఈఓ-2 శ్రీలక్ష్మి గైర్హాజరు కావడంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీ సుధాప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి ఇస్లావత్ భవాని, నాయకులు రామలింగేశ్వరరావు, అమరబాలేశ్వరరావు పాల్గొన్నారు.

పంచాయతీలే సంపాదించుకోవాలి

పామర్రు: పంచాయతీలు వాటికి సంబంధించి ఆదాయం అవే సంపాదించుకునేలా సిద్ధం చేయాలనే ఉద్దేశంతో గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. పామర్రు సచివాలయం-1 వద్ద శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. పంచాయతీల ఆదాయం పెంచేలా పలు పథకాలను అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు కె స్వరూపరాణి, గ్రామ సర్పంచ్ కె.కస్తూరి, తహసీల్దార్ రవికాంత్, ఎంపీడీఓ రామకృష్ణ పాల్గొన్నారు.



పామర్రు గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: గ్రామాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి వైపు పరిపాలనను నడిపించేందుకు ఈ గ్రామ సభల్లో దృష్టి సారించినట్లు ఎంపీడీఓ డి.కృష్ణవేణి తెలిపారు. గుడ్లవల్లేరు గ్రామ సచివాలయ ప్రాంగణంలో శుక్రవారం గ్రామసభను నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి దిలీప్‌కుమార్, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దావులూరి సురేంద్రబాబు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

ముదినేపల్లి రూరల్: గ్రామాల అభివృద్ధికి స్థానిక ప్రజా ప్రతినిధులతో పాటు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ పి.మల్లీశ్వరీ, గ్రామసభల మండల ప్రత్యేక అధికారి ఆర్‌వీ నాగరాణి అన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి పనులను గుర్తించి ఆమోదించేందుకు శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఆయా సభల్లో సర్పంచ్‌లు గంటా రాకేష్, పరసా విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: గ్రామసభలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి పురస్కరించుకుని సర్పంచ్ మెండా ఝాన్సీ నివాళులర్పించారు. డెప్యూటీ కలెక్టర్ కె.బాజ్జి, ఏఓ జె.శ్రీనివాసరావు, కార్యదర్శి కొండలు, ఎల్ఎస్ భాస్కరరావు, అప్పారావు, కోట ప్రసాద్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



వసతుల కల్పనకు నిధుల మంజూరు

గుడివాడరూరల్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఎంపీడీఓ అనగాని వెంకటరమణ అన్నారు. మండలంలోని మల్లాయపాలెం సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీఓ మాట్లాడారు. ప్రభుత్వం మండలంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు, ఇతర సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. జనాభా ప్రతిపదికన ఆయా గ్రామాలకు నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, గ్రామస్తులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. రామనపూడి గ్రామ సభలో మండల పరిషత్ ఏఓ త్రినాథ తిరుమలరావు, శేరీగొల్వేపల్లిలో సర్పంచ్ మేడేపల్లి అదృష్టకుమారి, బిళ్లపాడులో ప్రత్యేకాధికారి, మండల వ్యవసాయశాఖ అధికారి బి.అనంతలక్ష్మి పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనుల కల్పన, ప్రణాళికపై సచివాలయాల్లో నిర్వహించిన గ్రామసభలు ప్రశాంతంగా శుక్రవారం ముగిశాయి. మండలంలో మొత్తం 26 పంచాయతీల్లో సభలు నిర్వహించారు. తొలుత ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. కై కలూరు పంచాయతీలో సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. నోడల్ ఆఫీసర్‌గా హౌసింగ్ ఏఈ శేఖర్ వ్యవహరించారు. ముఖ్య అతిథిగా కైకలూరు స్పెషల్ ఆఫీసర్, జిల్లా డిప్యూటీ సీఈఓ దీప్తి విచ్చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్డీ వి.రవిశంకరరావు, ఏపీఓ చరణ్, హెచ్ఎం దానం ప్రసాద్, సెక్రెటరీలు వెంకటేశ్వరరావు, రవి కిరణ్, కూటమి నేతలు పూల రాజీ, కొల్లి బాబి పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

మచిలీపట్నంటౌన్: కోల్‌కతా ఘటనను నిరసిస్తూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి స్థానిక రాజుపేటలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఐద్వా నగర కార్యదర్శి కొడాలి సుజాత మాట్లాడుతూ ప్రాణం పోసే వైద్యులకే భద్రత కరువైందన్నారు. దేశంలో మహిళల రక్షణకు చట్టాలు ఉన్నా పటిష్టంగా అమలు చేయకపోవటం వల్ల మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయన్నారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్యను ప్రజలందరూ ఖండించాలన్నారు. దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఫిజియోథెరపీతో వైకల్యానికి చెక్

పామర్రు: ఫిజియోథెరపీతో వైకల్యానికి చెక్ పెట్టవచ్చని పామర్రు ఎంఈఓ-2 గుమ్మడి పద్మవాణి పేర్కొన్నారు. స్థానిక భవిత కేంద్రంలో చిన్నారులకు శుక్రవారం ఫిజియోథెరపీ నిర్వహించారు. 11 మందికి వ్యాయామ చికిత్స నిర్వహించారు. ఫిజియోథెరపీ వైద్యులు జె.నాగమల్లేశ్వరరావు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు కె.మరియన్న, కోటేశ్వరరావు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎంపిక

ముదినేపల్లి రూరల్: ఏపీటీఎఫ్ మండల శాఖ కార్యవర్గ ఎన్నిక ముదినేపల్లిలో శుక్రవారం జరిగింది. మండల అధ్యక్షుడిగా చినకామనపూడి యూపీ స్కూల్‌కు చెందిన ఎ.కృపాకర్, ప్రధాన కార్యదర్శిగా డి.వెంకటరత్నంతో పాటు మరో నలుగురు సభ్యులు ఎంపికయ్యారు. సమావేశంలో జిల్లా నాయకులు బేతాల రాజేంద్రప్రసాద్, బి శ్యాంసుందర్, సీహెచ్ నాగమల్లేశ్వరరావు, రామకృష్ణారెడ్డి, భాస్కరవర్మ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం



ముదినేపల్లి రూరల్: బ్రెయిన్ క్యాన్సర్‌తో మృతి చెందిన పేద బాలిక అంత్యక్రియలకు డాక్టర్ అంబుల మనోజ్ శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని సంఘర్షణపురానికి చెందిన కాలవల్ల సంధ్య (14) అనే బాలిక కొంతకాలంగా బ్రెయిన్ క్యాన్సర్‌తో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించింది. తల్లిదండ్రులు అబ్రహాం, దానమ్మ కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి తండ్రి మనోజ్ సహకారంతో బాలిక తల్లిదండ్రులకు రూ.5 వేలు సాయం అందజేశారు.

ఎయిడ్స్‌ను తరిమికొట్టాలి



వలివర్తిపాడు ర్యాలీలో డ్వాక్రా మహిళలు, అంకిత స్వచ్ఛంద సభ్యులు

గుడివాడరూరల్: దేశంలో మహమ్మారిగా ఉన్న ఎయిడ్స్‌ను అందరూ తరిమికొట్టాలని అంకిత స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ టి.అరుణకుమార్ అన్నారు. మండలంలోని వలివర్తిపాడు గ్రామంలో రాష్ట్ర, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అంకిత సంస్థవారు అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, సురక్షితం కాని సంబంధాలు, సిరంజిల వలన వ్యాపిస్తుందన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ఎయిడ్స్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లావణ్య, ఎంఈకే ప్రసాద్, ఆశావర్కర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

సీఐ చిన్ని నాగప్రసాద్



మాట్లాడుతున్న సీఐ చిన్ని నాగప్రసాద్

గుడివాడరూరల్: మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని టూటౌన్ సీఐ చిన్ని నాగప్రసాద్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాలు వినియోగిస్తే జరిగే అనర్థాలపై టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అదేవిధంగా మత్తు పదార్థాలకు బానిసలుగా మారకుండా ఉండాలన్నారు. క్రమ శిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. గుడివాడ టూటౌన్ పరిధిలో ఎక్కడైనా నిషేధిత గంజాయి, డ్రగ్స్, కొకైన్ తదితర మత్తు పదార్థాలు విక్రయిస్తే ఆయా ప్రాంతాల్లో ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీసీఎస్ సీఐ రమణమ్మ, కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి పాల్గొన్నారు.

టంగుటూరికి ఘన నివాళులు



టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్, అధికారులు

గుడివాడ టౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులును యువత ఆదర్శంగా తీసుకోవాలని గుడివాడ మున్సిపల్ కమిషనర్ జి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రకాశం పంతులు జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ టి.వి.కృష్ణారావు, అధికారులు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: చింతపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో శుక్రవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాసరావు, రవి, శారదరాణి, రోజా రాణి, లక్ష్మీకాంతం, నాగేశ్వరరావు, నగేష్ పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టంగుటూరి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ వై.రామకృష్ణ, కార్యాలయ సూపరింటెండెంట్ ప్రమీళ, ఈఓపీఆర్డీ రాజ్‌కుమార్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

కైకలూరులో..

కై కలూరు: ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని కలిదిండి గ్రంథాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయని చిత్ర పటానికి పలువురు నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు, విద్యార్థులు, సాహితీమిత్రులు పాల్గొన్నారు.

వయ్యారి భామ మొక్కలతో అప్రమత్తం

కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీలత

ఘంటసాల: వయ్యారి భామ కలుపు మొక్కలతో అప్రమత్తంగా ఉండాలని ఘంటసాల కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత శుక్రవారం తెలిపారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ఆమె మాట్లాడుతూ వయ్యారి భామ కలుపు మొక్కల నిర్మూలనపై అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం, పరిశోధన కేంద్రాల పరిధిలోని వివిధ గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. వయ్యారిభామ కలుపు మొక్కల వలన వివిధ రకాలైన చర్మ, ఊపిరితిత్తుల వ్యాధులు కలుగుతాయని, వయ్యారి భామ కలుపు మొక్క వలన వచ్చే దుష్ప్రభావాలను, మొక్కల నిర్మూలన గురించి రైతులకు వివరించారు. ఈ మొక్కల వలన పంటలు, పశుగ్రాసం దిగుబడి తగ్గుతుందన్నారు. దీని నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలు, ఆవశ్యకతను డాక్టర్ శ్రీలత వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ వి.మంజువాణి, యశ్వంత్‌కుమార్, డాక్టర్ రేవతి, జి.కృష్ణవేణి, డాక్టర్ నవీన్, రైతులు, రాప్ వే విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

కోసూరు(మొవ్వ): మొవ్వ మండలం కోసూరు పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన గ్రామ సభలో అధికారుల విధులకు భంగం కల్గించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కూచిపూడి ఎస్ఐ ఎం.సుబ్రమణ్యం తెలిపారు. కోసూరు గ్రామానికి చెందిన బుర్రే మస్తాన్ తాగిన మైకంలో ఉండి పంచాయతీ కార్యదర్శి విధులకు ఆటంకం కల్పించాడని, ఈఓ పిలుపు మేరకు అక్కడ ఉన్న హెడ్ కానిస్టేబుల్ మోహనరావు, కానిస్టేబుల్ ప్రమోద్‌లు ఆపేందుకు ప్రయత్నించగా మస్తాన్, అతనితో పాటు పాలేటి సునంద్‌లు అధికారులపై తిరగబడి విధులకు ఆటంకం కల్గించినట్లు పేర్కొన్నారు. పంచాయితీ కార్యదర్శి ఎంఎస్ఎస్ మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి తీర్మానం

మండవల్లి: గ్రామసభలో ప్రజల సూచన మేరకు 21 సీసీ రోడ్లు, 38 సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి శుక్రవారం తీర్మానం చేశారు. తొలుత టంగుటూరి ప్రకాశం జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశానికి సర్పంచ్ ఝాన్సీ అధ్యక్షత వహించారు. మండల స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ కె.బాజ్జి, గ్రామసభ స్పెషల్ ఆఫీసర్ ఏఓ జె.శ్రీనివాస్, కార్యదర్శి ఎం.కొండలు, ఐక్య వేదిక ప్రతినిధులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకం

మండవల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో శుక్రవారం గెస్ట్ లెక్చరర్లను నియమించారు. వీరిని కాలేజ్ లెవెల్ కమిటీ నియమించింది. మండవల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.రవితేజ, కలిదిండి జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ జీటీపీ రావు, కాలేజ్ లెవెల్ కమిటీగా వ్యవహరించి గెస్ట్ లెక్చరర్లను నియమించారు. ఫిజిక్స్‌కు ఎస్.రంగారావు, హిస్టరీ కె.నవీన్ బాబు, ఆర్.వెంకన్నబాబును గెస్ట్ లెక్చరర్లుగా నియమించినట్లు మండవల్లి కళాశాల ప్రిన్సిపాల్ బి.రవితేజ తెలిపారు.